https://epaper.manasamajam.com Contact No. 9989788438, 9505285656

# మన సమాజం

తెలుగు డిజిటల్ దిన పత్రిక

Truth towards the Society

చైర్మెన్ : పార్వతి సురేష్ కుమార్ ఎడిటర్ : పార్వతి రాజేష్ కుమార్

సంపుటి : 01 సంచిక : 339 బుధవారం 25-2-2026 పేజీలు : 4

రిపోర్టర్స్ కావలెను

మన సమాజం
Truth towards the Society

మన సమాజం తెలుగు డిజిటల్ దినపత్రికలో
నిఖార్సైన జర్నలిస్టుగా నిలబడాలనుకుంటున్నారా?
అన్ని తరహా వార్తలు, కథనాలు ఎలాంటి ఆంక్షలు లేకుండా
రాయాలని కోరుకుంటున్నారా?

తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, మండలాలల్లో
పనిచేసేందుకు విలేఖరులు కావలెను...
మీ కలాలకు పదును పెట్టండి.

సంప్రదించవలసిన నెంబర్లు
9989788438, 9505485656.

## విప్లవ పోరాటానికి ముగింపు

### దేవ్‌జీ సహా నలుగురు అగ్రనేతల లొంగుబాటు

**మావోయిస్టు పార్టీ సంస్థాగత నిర్మాణం పతనం**

**రాష్ట్ర ప్రభుత్వ పునరావాస చర్యలతో లొంగుబాట్లు**

**పార్టీలో తెలంగాణకు చెందినవారు ఇంకా 11 మంది**

**వారు కూడా జనజీవన స్రవంతిలో కలవాలి: డీజీపీ**

**డీజీపీ సమక్షంలో లొంగిపోయిన తిప్పిరి తిరుపతి, మల్లా రాజిరెడ్డి, బడే చొక్కారావు, నూనె నర్సింహారెడ్డి**

**అనారోగ్యంతోనే రహస్య జీవితం వదిలాం.. ప్రజా సమస్యలపై ఇకపైనా పోరాటాలు చేస్తాం: దేవ్‌జీ**

**నేపాల్‌లో గణపతి.. అదుపులోకి తీసుకున్న పోలీసులు?**



**హైదరాబాద్, ఫిబ్రవరి 24**
తెలంగాణలో రూపుదిద్దుకున్న మావోయిస్టు విప్లవ పోరాటం ఇక్కడే ముగుస్తోందని రాష్ట్ర డీజీపీ శివధర్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న పునరావాస చర్యలను గమనించి మావోయిస్టులు లొంగిపోతున్నారని తెలిపారు. మంగళవారం మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ అప్రకటిత కార్యదర్శి తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ సహా నలుగురు అగ్రనేతలు పోలీసుల ఎదుట లొంగిపోయారు. హైదరాబాద్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో డీజీపీ సమక్షంలో దేవ్‌జీతోపాటు మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు మల్లా రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్, తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శి బడే చొక్కారావు అలియాస్ దామోదర్, రాష్ట్ర కమిటీ సభ్యుడు నూనె నర్సింహారెడ్డి అలియాస్ గంగన్న లొంగిపోయారు. ఈ సందర్భంగా శివధర్‌రెడ్డి మాట్లాడుతూ.. నలుగురు అగ్రనేతలు లొంగిపోవడం ద్వారా మావోయిస్టు పార్టీ అత్యున్నత సంస్థాగత నిర్మాణం పతనమైందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభ్యర్థన మేరకు లొంగిపోతున్న మావోయిస్టుల పునరావాసానికి కట్టుబడి ఉంటామని, వారి ప్రాణాలకు తమ ప్రాణాలు అడ్డువేసి కాపాడుతామని ప్రకటించారు.

## 25మంది ఎమ్మెల్యేల రహస్య మంతనాలు

**బీఆర్ఎస్ మునిగిపోయిన నావ**

**కరీంనగర్‌లో కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు దిమ్మదిరిగే షాక్**

**కేంద్రమంత్రి బండి సంజయ్**



**హైదరాబాద్, ఫిబ్రవరి 24**
కర్ణాటకలో మాదిరిగా తెలంగాణలో కూడా అధికార కాంగ్రెస్ పార్టీలో ముసలం ప్రారంభమైందని కేంద్ర మంత్రి బండి సంజయ్ వ్యాఖ్యానించారు. 25 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఫోన్‌లో మాట్లాడుకున్నారని చెప్పారు. మంత్రి పదవుల కోసం రెండు జిల్లాల ఎమ్మెల్యేలు రహస్య భేటీలు నిర్వహించారన్నారు. కరీంనగర్ పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలోని మునిసిపాలిటీల కౌన్సిలర్లు, కరీంనగర్ మేయర్, డిప్యూటీ మేయర్లను మంగళవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో సన్మానించారు. తర్వాత పాతబస్తీలోని భాగ్యలక్ష్మి అమ్మవారి గుడిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో సంజయ్ మాట్లాడుతూ.. "8 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సోమవారం ఓ చోట రహస్యంగా భేటీ అయ్యారు. మంత్రుల కమీషన్లు, కలెక్షన్లపై చర్చించుకున్నారు.. వారి అవినీతి వల్ల పార్టీ భ్రష్టు పట్టిపోతోంది. మంత్రులుగా మాకు అవకాశం ఇవ్వండి అంటూ రాహుల్‌గాంధీకి లేఖరాశారు. ఇది వాస్తవం' అని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి, తమకు నిధులివ్వడం లేదని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు నారాజ్‌గా ఉన్నారన్నారు. కాంగ్రెస్ నేతలు తమ ప్రభుత్వాన్ని కూల్చే అవకాశం ప్రతిపక్షాలకు ఇవ్వరని, వారే ఆ పని చేస్తారని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ పార్టీ 'మునిగిపోయిన' నావ అని పేర్కొన్న సంజయ్.. ఆ పార్టీని రక్షించడం ఎవరి తరమూ కాదని తేల్చిచెప్పారు. మునిసిపల్ ఎన్నికల్లో 7 కార్పోరేషన్లలో ఆ పార్టీ అడ్రస్ గల్లంతు కాగా, అంతకుముందు ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎసకు అభ్యర్థులే దొరక లేదన్నారు.

## మా దెబ్బకు సీఎం సోయికొచ్చిండు..

**మేం దేవాదులను సందర్శించినాక హడావుడి: హరీశ్‌రావు**



**వరంగల్,ఫిబ్రవరి 24 :**
దేవాదులను పూర్తి చేయడంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం విఫలమైందని మాజీమంత్రి టి.హరీశ్‌రావు విమర్శించారు. వరంగల్ పర్యటనలో భాగంగా హరీశ్‌రావు వరంగల్ పాత సెంట్రల్ జైలు స్థలంలో జరుగుతున్న సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ పనులను బీఆర్ఎస్ నేతలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. తమ దెబ్బకు సోయి వచ్చి సీఎం హడావుడిగా దేవాదుల ప్రాజెక్టును సందర్శించాడని ఎద్దేవా చేశారు. కేసీఆర్‌కు మంచి పేరు వస్తుందనే అక్కసుతోనే వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పనులను కావాలని నత్తనడకన సాగిస్తున్నారన్నారు. రాష్ట్రంలోని జర్నలిస్టులను రేవంత్‌రెడ్డి సర్కార్ చిన్నచూపు చేస్తోందని హరీశ్‌రావు విమర్శించారు. జర్నలిస్టులకు ఎలాంటి నిబంధనలు లేకుండా అక్రిడిటేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## ఎప్‌స్టీన్ భయంతోనే మోదీ లొంగిపోయారు!

**- అమెరికాతో వాణిజ్య ఒప్పందానికి అంగీకరించారు**

**- ఆ ఒప్పందం రైతులకు శరాఘాతం: రాహుల్ - మోదీ అంత పిరికి ప్రధానిని చూళ్లేదు: ఖర్గే**



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24:**
ఎప్‌స్టీన్ ఫైళ్ల భయం, అదానీ మీద అమెరికాలో నమోదైన క్రిమినల్ కేసు ఒత్తిడి నేపథ్యంలోనే ప్రధాని మోదీ.. అమెరికాతో ఏకపక్ష వాణిజ్య ఒప్పందానికి అంగీకరించారని ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. ఈ ఒప్పందం దేశంలోని రైతులకు పూర్తిగా వ్యతిరేకమైనదన్నారు. మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో మంగళవారం జరిగిన కిసాన్ మహాచౌపల్ (రైతుల మహాసభ)లో ప్రసంగిస్తూ రాహుల్‌గాంధీ ఈ వ్యాఖ్యలు చేశారు. ట్రంప్ సుంకాలను అమెరికా సుప్రీంకోర్టు కొట్టేసిన విషయాన్ని గుర్తు చేస్తూ.. అమెరికా-భారత్ వాణిజ్య ఒప్పందాన్ని రద్దు చేసే ధైర్యం ఉందా? అంటూ మోదీకి సవాల్ విసిరారు. ఒప్పందం వెనుక రెండు కారణాలున్నాయన్నారు. 'మొదటిది.. ఎప్‌స్టీన్ ఫైళ్లు. ఈ ఫైళ్లలో కేంద్ర మంత్రి హర్దీపసింగ్‌పురీ పేరు కూడా ఉంది. వాటిని చూపెట్టి మోదీని భయపెట్టారు. మా మాట వినకపోతే ఫైళ్లలోని అంశాలను బయటపెడతామన్నారు. ఇక, రెండో కారణం.. అమెరికాలో అదానీపై నమోదైన క్రిమినల్ కేసు. ఇది మోదీ లక్ష్యంగా అదానీ మీద పెట్టిన కేసు' అని రాహుల్ అన్నారు. ఇదే సభలో కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే మాట్లాడుతూ, 60ఏళ్ల రాజకీయ జీవితంలో మోదీ అంతటి పిరికి ప్రధానిని చూడలేదన్నారు.

## తమిళనాట శశికళ కొత్త పార్టీ



**చెన్నై, ఫిబ్రవరి 24**
తమిళనాడులో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న వేళ.. రాష్ట్రంలో మరో కొత్త పార్టీ ప్రారంభమైంది. జయలలిత సన్నిహితురాలు, అన్నాడీఎంకే బహిష్కృత నాయకురాలు శశికళ మంగళవారం కొత్త పార్టీని ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. జయలలిత 78వ జయంతిని పురస్కరించుకుని రామనాథపురంలో పార్టీ పతాకాన్ని ఆవిష్కరించిన ఆమె.. త్వరలోనే పార్టీ పేరును వెల్లడిస్తానని తెలిపారు.

## కేరళ ఇక కేరళం!

రాష్ట్ర పేరు మార్పునకు కేంద్రం ఆమోదం

సేవా తీర్థ్‌లో తొలిసారి క్యాబినెట్ భేటీ



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24:**
కేరళ ఇకపై కేరళం కానుంది. ఈ రాష్ట్రం పేరును మార్చడానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. సుదీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న ఈ ప్రతిపాదనకు మంగళవారం ప్రధాని మోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర క్యాబినెట్ ఆమోదముద్ర వేసింది. ఈ విషయాన్ని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. ఒక రాష్ట్రం పేరు మార్చాలంటే ఆ ప్రతిపాదన తీర్మానాన్ని శాసనసభ ఆమోదించాలి. రాష్ట్ర పేరు మార్పు బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టేముందు రాష్ట్రపతి సంబంధిత రాష్ట్ర శాసనసభ అభిప్రాయం తీసుకుంటారు. తర్వాత బిల్లును పార్లమెంట్ ఉభయ సభల్లో ప్రవేశపెడతారు. ఆ బిల్లు ఆమోదానికి సాధారణ మెజారిటీ సరిపోతుంది. అనంతరం రాష్ట్రపతి ఆమోదంతో పేరు అధికారికంగా మారుతుంది. ఈ ఏడాది కేరళలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న వేళ ఇది ప్రాధాన్యం సంతరించుకుంది. కేరళ పేరు మార్పుపై తొలిసారి 2023లో రాష్ట్ర అసెంబ్లీ తీర్మానాన్ని ఆమోదించింది. ఇదిలా ఉండగా, మంగళవారం కేంద్ర మంత్రివర్గ సమావేశం కొత్తగా నిర్మించిన ప్రధానమంత్రి కార్యాలయం 'సేవా తీర్థ్'లో జరిగింది. సేవాతీర్థ్‌లో క్యాబినెట్ భేటీ జరగడం ఇదే తొలిసారి. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, బిహార్, ఝార్ఖండ్ రాష్ట్రాలకు సంబంధించిన రూ.9072 కోట్ల విలువైన మూడు రైల్వే ప్రాజెక్టులకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది.

## దేవుడు క్షమించడు!

### తిరుమల పవిత్రతను దెబ్బతీసేందుకు ముందస్తు కుట్ర: సీఎం

**కల్తీ నెయ్యి.. వ్యవస్థీకృత సిండికేట్ నేరమే**

**చుక్కపాలు సేకరించని సంస్థలకు నెయ్యి టెండర్లు**

**రసాయనాలు, ఇతర పదార్థాలతో తయారీ**

**జంతు కొవ్వు కలిసిందని ఎన్‌డీడీబీ నివేదిక**

**దాని ఆధారంగానే నేను, పవన్ మాట్లాడాం**


**2022లోనే కల్తీ వెలుగులోకి**

**సీఎ?ఫటీఆర్ఐ నివేదికను తొక్కిపెట్టిన సుబ్బారెడ్డి**

**వైఎస్ నాటి నుంచే తిరుమలలో అపచారాలు**

**పాపాలు దాచేందుకే హెరిటేజ్‌పై దుష్ప్రచారం**

**అసెంబ్లీలో సీఎం చంద్రబాబు ధ్వజం**



**అమరావతి, ఫిబ్రవరి 24**
దేవదేవుడైన తిరుమల శ్రీవేంకటేశ్వరుడి పవిత్రతను, సనాతన ధర్మాన్ని దెబ్బతీసేందుకు ముందస్తు కుట్ర జరిగిందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఈ దిశగా ఓ వ్యవస్థీకృత సిండికేట్ దారుణ నేరాలకు పాల్పడిందని, ఇందులో లడ్డూ ప్రసాదాన్ని కల్తీ చేయడం ఒకటని చెప్పారు. ఒకవైపు కల్తీనెయ్యి సరఫరా.. మరోవైపు అన్యమతప్రచారం.. ఇంకోవైపు హిందూమతంపై దాడిచేయడం ద్వారా వ్యవస్థీకృత నేరాలకు పాల్పడిన వ్యక్తులను దేవదేవుడు క్షమించడన్నారు. కల్తీ నెయ్యి వ్యవహారంలో సీబీఐ నేతృత్వంలోని సిట్ విచారణలో అనేక దారుణాలు వెలుగులోకి వచ్చినా.. తప్పుడు పనులు చేసిన వ్యక్తులు ఇంకా బుకాయించే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. తమ తప్పును కప్పిపుచ్చుకునేందుకు హెరిటేజ్‌పై బురదజల్లుతున్నారని మండిపడ్డారు. మంగళవారం అసెంబ్లీలో కల్తీనెయ్యి, దాని అనంతర పరిణామాలపై సీఎం ప్రసంగించారు. ముఖ్యాంశాలివీ.. 2019-24 మధ్య తిరుమలకు కల్తీ నెయ్యి సరఫరా చేసేందుకు టెండర్ నిబంధనలు మార్చారు. నాణ్యతా ప్రమాణాలు తగ్గించారు. నెయ్యి సరఫరా చేసే సంస్థ నెలకు కనీసం 4 లక్షల లీటర్ల పాలు సేకరించాలన్న నిబంధన ఎత్తివేశారు. వార్షిక టర్నోవర్‌ను రూ.150 కోట్లకు కుదించారు. తాము అనుకున్న కంపెనీలకు టెండర్ కట్టబెట్టేందుకు ముందస్తు కుట్రను అమలు చేశారు. తిరుమలకు సరఫరా అవుతున్న నెయ్యిలో కల్తీ ఉందని 2022లోనే ఫిర్యాదులు వచ్చాయి. నెయ్యి శాంపిళ్లను సీఎ?ఫటీఆర్ఐ ల్యాబ్‌లో పరీక్షించగా కల్తీ ఉందని రిపోర్టు వచ్చింది. ఈ నివేదికను నాటి టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి తొక్కిపెట్టారు. మా ప్రభుత్వం వచ్చాక తిరుమలకు సరఫరా అవుతున్న నెయ్యిపై ఫిర్యాదులు రావడంతో అప్పటి టీటీడీ ఈవో (శ్యామలరావు) నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు (ఎన్‌డీబీబీ)-కాఫ్ ల్యాబ్‌లో 2024 జూలైలో రెండు దఫాలుగా పరీక్ష చేయించారు.

# దోపిడీ దొంగల రాజ్యం లా కాంగ్రెస్ ప్రభుత్వం

**అదిలాబాద్ జైలులో బాల్క సుమన్ పరామర్శించిన కేటీఆర్**

**రైతు సంక్షేమంపై తీవ్ర ఆవేదన - అవినీతి ఆరోపణలపై సమాధానం చెప్పాలని డిమాండ్**





**అదిలాబాద్, ఫిబ్రవరి 24**

అదిలాబాద్ జైలులో ఉన్న చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ను పరామర్శించిన అనంతరం మీడియాతో మాట్లాడిన భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కే.టి. రామారావు రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పాలనను పూర్తిగా గాలికి వదిలేసిందని, దోపిడీ పాలన నడుస్తోందని ఆరోపించారు. ప్రజా సమస్యలు పక్కనపెట్టి వ్యక్తిగత ప్రయోజనాలకే ప్రభుత్వం పనిచేస్తోందని విమర్శించారు. ప్రస్తుతం తెలంగాణలో ప్రజా సమస్యలపై చర్చ జరగడం లేదని, కేవలం వేల కోట్ల రూపాయల వ్యవహారాల గురించే చర్చ సాగుతోందని కేటీఆర్ అన్నారు. రెండేళ్ల కాలంలోనే ఢిల్లీకి పంపేందుకు వెయ్యి కోట్లు సిద్ధంగా ఉన్నాయంటే, రాష్ట్ర ప్రజల సొమ్ము ఇంకెన్ని వేల కోట్లు ఖర్చయి ఉంటాయో ప్రజలే ఆలోచించాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రజల కష్టార్జిత ధనం ఎక్కడికి వెళ్తోందో ముఖ్యమంత్రి స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతు సంక్షేమంపై కూడా ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో కేసీఆర్ హయాంలో డిసెంబర్ నెలలోనే రైతుల ఖాతాల్లో జమయ్యే రైతుబంధు నిధులు, ఇప్పుడు మార్చి వచ్చినా అందలేదని ఎద్దేవా చేశారు. రైతులకు రుణమాఫీ అమలు చేయడంలో చిత్తశుద్ధి లేదని, జొన్నలు, పత్తి వంటి పంటలను కొనుగోలు చేయడంలో ప్రభుత్వానికి సామర్థ్యం కనిపించడం లేదని విమర్శించారు. దీని వల్ల రైతాంగం తీవ్ర ఇబ్బందులు పడుతోందని అన్నారు.ముఖ్యమంత్రి అవినీతి ఆరోపణలపై బహిరంగంగా సమాధానం చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. గతంలో జరిగిన ఓటుకు నోటు వ్యవహారాన్ని గుర్తుచేస్తూ, అవినీతి అంశాలపై కేంద్ర దర్యాప్తు సంస్థలు ఎందుకు మౌనంగా ఉన్నాయని ప్రశ్నించారు. ప్రజా ధనంపై ఎలాంటి అనుమానాలున్నా వాటిపై సమగ్ర విచారణ జరగాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.

# "మావోయిస్టు రహిత భారత్" లక్ష్యానికి వేగం

**హింసకు విరామం పలికి లొంగిపోయిన మావోయిస్టు నేతలు**

**అభివృద్ధి మార్గమే సరైన దారి అన్న సందేశం - తెలంగాణలో "ఆపరేషన్ కాగర్" విజయంపై అభినందనలు**






**న్యూఢిల్లీ / హైదరాబాద్, ఫిబ్రవరి 24**

"మావోయిస్టు రహిత భారత్" లక్ష్యం స్పష్టతతో, దృఢ సంకల్పంతో ముందుకు సాగుతోందని కేంద్ర నాయకత్వం అభిప్రాయపడింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దూరదృష్టి, కేంద్ర గృహ మంత్రి అమిత్ షా నాయకత్వంలో దేశవ్యాప్తంగా మావోయిస్టు వ్యతిరేక చర్యలు వేగవంతమయ్యాయని పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ద్వారా ప్రజలను ప్రధాన ప్రవాహంలోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని వెల్లడించారు. సీనియర్ మావోయిస్టు నాయకులు దేవ్ జీ, రాజిరెడ్డి, దామోదర్, నర్సింహారెడ్డి హింస వల్ల ప్రజలకు ఎలాంటి ప్రయోజనం లేదని గ్రహించి పోలీసుల ఎదుట లొంగిపోయిన విషయాన్ని స్వాగతించారు. ప్రజాస్వామ్య మార్గాన్ని ఎంచుకోవడం సరైన నిర్ణయమని అభినందించారు. మావోయిజం, నక్సలిజం ద్వారా దశాబ్దాలుగా సాధించినది నష్టం, బాధ మాత్రమేనని పేర్కొన్నారు.అభివృద్ధి, సంక్షేమ పథకాల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, పాఠశాలలు, ఆరోగ్య సేవలు, ఉపాధి అవకాశాలు కల్పించడం వల్లే ప్రజలు మార్పు వైపు ఆకర్షితులవుతున్నారని చెప్పారు. శాంతి, స్థిరత్వం ద్వారానే ప్రాంతీయ అభివృద్ధి సాధ్యమని స్పష్టం చేశారు. మిగిలిన మావోయిస్టులు కూడా హింసను విడిచిపెట్టి ప్రధాన ప్రవాహంలోకి రావాలని పిలుపునిచ్చారు. తెలంగాణలో నిర్వహించిన "ఆపరేషన్ కాగర్" విజయవంతం కావడంపై రాష్ట్ర పోలీసులను అభినందించారు. రాష్ట్ర పోలీసు మహానిర్దేశకుడు శివధర్ రెడ్డి, నిఘా విభాగపు మహానిర్వాహకురాలు సుమతి కృషిని ప్రశంసించారు. జాతీయ లక్ష్య సాధనకు ఇంకా కొంత సమయం మిగిలి ఉన్నందున భూగర్భంలో ఉన్న మావోయిస్టులు స్వచ్ఛందంగా లొంగిపోవాలని, లేకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# ఆదిలాబాద్ ఐటీ టవర్‌ను పరిశీలించిన కేటీఆర్

**నిర్మాణ పురోగతిపై అధికారులతో చర్చ - ద్వితీయ శ్రేణి పట్టణాలకు ఐటీ విస్తరణ లక్ష్యం**

**బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రారంభమైన ప్రాజెక్టు**



**ఆదిలాబాద్, ఫిబ్రవరి 24**

ఆదిలాబాద్ పర్యటనలో భాగంగా భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కే.టి. రామారావు నిర్మాణంలో ఉన్న ఐటీ టవర్ భవనాన్ని పరిశీలించారు. ప్రాజెక్టు ప్రస్తుత పరిస్థితి, నిర్మాణ పురోగతి, మిగిలిన పనుల వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. భవన నిర్మాణం ఎంతవరకు పూర్తయిందో ప్రత్యక్షంగా పరిశీలించారు. ద్వితీయ శ్రేణి పట్టణాలకు ఐటీ సంస్థలను తీసుకెళ్లాలన్న లక్ష్యంతోనే ఆదిలాబాద్‌లో ఐటీ టవర్ నిర్మాణానికి ప్రణాళిక రూపొందించబడిందని కేటీఆర్ గుర్తుచేశారు. తన ఐటీ శాఖ మంత్రి హయాంలో ఈ ప్రాజెక్టుకు నిధుల మంజూరు జరిగిందని, ప్రాంతీయ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. జిల్లాలో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నదే ప్రధాన ఉద్దేశ్యమని పేర్కొన్నారు.భవన నిర్మాణం పెద్ద మొత్తంలో బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలోనే పూర్తయి ఒదని కేటీఆర్ తెలిపారు. ప్రాజెక్టును త్వరగా పూర్తి చేసి ఐటీ సంస్థలను ఆకర్షించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. స్థానిక యువతకు తమ స్వస్థలంలోనే ఉపాధి లభించేలా ఐటీ మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేయడం అవస˝రమని అన్నారు. ద్వితీయ శ్రేణి పట్టణాల అభివృద్ధి కోసం సాంకేతిక రంగాన్ని విస్తరించాల్సిన అవసరం ఉందని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. ఆదిలాబాద్ ఐటీ టవర్ పూర్తి స్థాయిలో ప్రారంభమైతే జిల్లాలో ఆర్థిక చైతన్యం పెరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

# తెలంగాణలో జనసేన పార్టీ బలోపేతం

**పవన్ కల్యాణ్ కీలక నిర్ణయం - పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించనున్నట్లు వెల్లడి**

**ఈ నెల 26 నుంచి 'ఉద్యమి' సభ్యత్వ నమోదు కార్యక్రమం - జిల్లాలు, లోక్ సభ సభ్యుల వారీగా ఇన్‌ఛార్జుల నియామకం**



జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ తెలంగాణలో క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇందులో భాగంగా పార్టీ సభ్యత్వ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు జనసేన తెలంగాణ విభాగం ప్రకటన విడుదల చేసింది. సభ్యత్వ నమోదు కార్యక్రమం కోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. జనసేన పార్టీ 'ఉద్యమి' సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఈ నెల 26వ తేదీ నుంచి దేశవ్యాప్తంగా నిర్వహించాలని పవన్ కల్యాణ్ నిర్ణయించారు. ఈ నేపథ్యంలో తెలంగాణలో పార్టీని 'ఉద్యమి' సభ్యత్వ నమోదు కార్యక్రమం ద్వారా క్షేత్రస్థాయిలో బలంగా తీసుకెళ్లి, సంస్థాగతంగా బలోపేతం చేయడానికి జిల్లాలవారీగా కొంతమంది నాయకులకు ఇన్‌ఛార్జ్ బాధ్యతలను అప్పగించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో నూతనంగా ఏర్పడిన మూడు కార్పొరేషన్‌లకు వేర్వేరు ఇన్‌ఛార్జులను నియమించారు .జనసేన పార్టీ ఉపాధ్యక్షులు బొంగునూరి మహేందర్, తెలంగాణ రాష్ట్ర ఇన్‌ఛార్జ్ నేమూరి శంకర్ గౌడ్, పార్టీ నాయకులు రాధారాం రాజలింగం, కావ్య మండపాక, శిరీష పొన్నూరి రాష్ట్రస్థాయిలో పర్యవేక్షిస్తారని ఆ ప్రకటనలో జనసేన పార్టీ తెలిపింది. ఆయా పార్లమెంట్ పరిధిలో సభ్యత్వ నమోదు కార్యక్రమాల బాధ్యతను రసువుకు నాయకులకు అప్పగించారు.

# బీటెక్ చదువుతున్న విద్యార్థిని ఆత్మహత్య

**ప్రైవేటు వసతి గృహంలో ఉరివేసుకున్న ఘటన**

**ఆసుపత్రికి తరలించినా ప్రయోజనం లేకపోవడం**

**కారణాలపై దర్యాప్తు ప్రారంభం**





**తిరుపతి, ఫిబ్రవరి 24**

తిరుపతిలోని మోహన్ బాబు యూనివర్సిటీలో బీటెక్ చివరి సంవత్సరం చదువుతున్న ఓ యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటన తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. మంగళం ప్రాంతానికి చెందిన 22 ఏళ్ల విద్యార్థిని కళాశాల బయట ఉన్న ప్రైవేటు వసతి గృహంలో నివసిస్తూ చదువులు కొనసాగిస్తోంది. ఆదివారం రాత్రి ఆమె గదిలో ఉరివేసుకున్న స్థితిలో కనిపించడంతో ఈ సంఘటన వెలుగులోకి వచ్చింది. సహచరులు గమనించి వెంటనే ఆమెను నారావారిపల్లి ప్రాంతంలోని ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ సంఘటనతో కుటుంబ సభ్యులు, సహ విద్యార్థులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. కళాశాల వర్గాల్లోనూ ఆందోళన వ్యక్తమవుతోంది. విద్యార్థిని ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా తెలియరాలేదు. వ్యక్తిగత సమస్యలేనా, చదువుల ఒత్తిడేనా, లేక ఇతర కారణాలున్నాయా అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. వసతి గృహ నిర్వాహకులు, సహ విద్యార్థుల నుంచి వివరాలు సేకరిస్తున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో విచారణ కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పూర్తి వివరాలు దర్యాప్తు అనంతరం వెల్లడికానున్నాయి. విద్యార్థుల మానసిక ఆరోగ్యంపై అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉన్నదని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

# ఉద్యోగులు, పెన్షనర్లకు ప్రమాద బీమా అమలు

**ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపిన సంఘాల నాయకులు**

**రూ.1.20 కోట్ల ప్రమాద బీమా, రూ.1,056 కోట్ల మూలనిధితో ఆరోగ్య పథకం**

**1,998 వ్యాధులకు నగదు రహిత చికిత్స సౌకర్యం**



**హైదరాబాద్, ఫిబ్రవరి 24 :**

ఉద్యోగులు, పెన్షనర్లకు ఆరోగ్య పథకం మరియు ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తూ దశాబ్దాల కోరికను నెరవేర్చినందుకు ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డికు ఉద్యోగ, పెన్షనర్ల సంఘాల నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర మంత్రిమండలి ఆమోదించిన నిర్ణయాలపై ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలియజేశారు. ఉద్యోగులు, పెన్షనర్లకు రూ. 1.20 కోట్ల ప్రమాద బీమా వర్తింపజేయడం, రూ. 1,056 కోట్ల మూలనిధితో ఆరోగ్య పథకాన్ని అమలు చేయడం చారిత్రాత్మక నిర్ణయమని సంఘాల నాయకులు పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రకటించిన పథకం ద్వారా 1,998 వ్యాధులకు నగదు రహిత చికిత్స పొందే అవకాశం కల్పించడం ఉద్యోగ వర్గాలకు పెద్ద ఊరటనిచ్చిందన్నారు. ముఖ్యమంత్రి నేతృత్వంలోని మంత్రివర్గం ఉద్యోగ వర్గాల సంక్షేమానికి పెద్దపీట వేసిందని కొనియాడారు. ఈ నిర్ణయాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తాయని తెలిపారు. ప్రభుత్వ సంకల్పం వల్ల ఉద్యోగులు, పెన్షనర్లు ఆర్థిక భారం లేకుండా వైద్య సేవలు పొందగలరని అభిప్రాయపడ్డారు.ముఖ్యమంత్రిని కలిసిన వారిలో తెలంగాణ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల ఐకాస నాయకులు మారం జగదీశ్వర్, ఏలూరి శ్రీనివాసరావు, పి. దామోదర్ రెడ్డి, చావా రవి, కే. వెంకటేశ్వర్లు, ఉపేందర్ రెడ్డి, జి. సదానంద గౌడ్, ఉమాదేవి, వి. రవీందర్ రెడ్డి, గిరి శ్రీనివాస్ రెడ్డి, ఖాదర్, టి. లక్ష్మన్, వి. లచ్చిరెడ్డి, కె. రామకృష్ణ, ఎస్. రాములు, రమేష్ పాక, సీహెచ్. శ్రీనివాస్, బాణాల రాంరెడ్డి, వి. భిక్షం, డా. నిర్మల, ఎల్. దశరథ్, గరికె ఉపేందర్ రావు, సుగంధిని, భూమేశ్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

# మెట్‌పల్లిలో స్టడీ సెంటర్ ఏర్పాటుకు మంత్రి సానుకూలత

**జగిత్యాల**

జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణంలోని మూడవ వార్డులో విద్యార్థుల సౌకర్యార్థం స్టడీ సెంటర్ ఏర్పాటు చేయాలన్న వినతిపై రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సానుకూలంగా స్పందించారు. మంగళవారం మూడవ వార్డు కౌన్సిలర్ బత్తుల నరేష్, కోరుట్ల కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగ్ రావు ఆదేశాల మేరకు మంత్రిని కలిసి వార్డులో స్టడీ సెంటర్ అవశ్యకతను వివరించారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే నిరుపేద విద్యార్థులకు, యువతకు ఈ కేంద్రం ఎంతో ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు. కౌన్సిలర్ విజ్ఞప్తిపై మంత్రి తక్షణమే స్పందించారు. అక్కడికక్కడే ఆర్‌డీవో తో ఫోన్లో మాట్లాడి, స్టడీ సెంటర్ ఏర్పాటుకు సంబంధించి తగిన స్థలాన్ని పరిశీలించి, అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. మంత్రి త్వరితగతిన స్పందించడం పట్ల స్థానిక విద్యార్థులు, యువత హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్‌తో పాటు రాజ్యాంగ రక్షక దళ్ అధ్యక్షులు రేంజర్ల రాజేష్,సోమిడి సృజన్ముతునూరి సురేష్, నరేష్, ఆనంద్, శివ, అరవింద్ తదితరులు పాల్గొన్నా

## తెలంగాణ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్




మహబూబాబాద్ జిల్లా శాఖ కోశాధికారి నాగరాజు అధ్యక్షతన ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన నిరసన కార్యక్రమం జరిగింది. మధ్యాహ్న భోజన విరామ సమయంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నాగముని పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ ఐదు డి ఏల పెండింగ్ బకాయిలు ఉండడం వల్ల ఉద్యోగులు ఉపాధ్యాయులు చాలా ఇబ్బందులు పడుతున్నారని గృహ నిర్మాణ, అనారోగ్య, పిల్లల చదువుల విషయంలో ఆర్థిక నిర్ణయాలు తీసుకోలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. సీనియర్ ఉపాధ్యాయులు పెనుగొండ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ కేవలం పోరాటాల ద్వారా మాత్రమే హక్కులు సాధించబడతాయని సిపిఎస్ విధానం దేశవ్యాప్తంగా ఉద్యోగులను అభద్రతాభావంలోకి నెట్టిందని దేశవ్యాప్త ఉద్యమాలు, నిరసనలు మండల స్థాయి నుంచే ఇంకా తీవ్రతరం కావాలని ఉద్యోగులు దశల వారి పోరాటాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు ఉపాధ్యాయులు సిపిఐ ఉద్యోగులు పాల్గొన్నారు.

# అంబర్‌పేటలో విషాదం

**- ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి - ఆర్థిక ఇబ్బందులే కారణమా? పోలీసుల అనుమానం**

**- తల్లిదండ్రులతో పాటు కుమారుడు ఆత్మహత్య - ఘటనపై దర్యాప్తు కొనసాగిస్తున్న పోలీసులు**

హైదరాబాద్, ఫిబ్రవరి 24

హైదరాబాద్ అంబర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు ప్రాథమికంగా అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అంబర్‌పేట బాపునగర్ కాకతీయ వీధిలో నివసిస్తున్న రామ్‌రాజ్ (55), ఆయన భార్య మాధవి (50), కుమారుడు శశాంక్ (24)లు సోమవారం అర్ధరాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది. దంపతులకు ఇటీవలే కుమార్తె వివాహం జరిగినట్లు సమాచారం. రామ్‌రాజ్ గతంలో వ్యాపారం నిర్వహించేవారని, ఇటీవల ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు స్థానికులు తెలిపారు. ఘటనకు ముందు ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు బాండ్ పేపర్‌పై రాసి శశాంక్ తన స్నేహితుడికి సందేశం పంపినట్లు పుకార్లు వినిపిస్తున్నాయి. అయితే ఈ అంశాన్ని పోలీసులు అధికారికంగా నిర్ధారించలేదు. ఘటనాస్థలాన్ని పరిశీలించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాలను పోస్టుమార్టం కోసం ఆసుపత్రికి తరలించారు. ఆర్థిక సమస్యలే కారణమా, లేక మరే ఇతర అంశాలున్నాయా అన్న దానిపై లోతుగా విచారణ కొనసాగుతోంది. కుటుంబ సభ్యులు, పరిచయస్తుల వాంగ్మూలాలు సేకరిస్తున్నారు.



# నెహ్రూ జూపార్క్‌లో హై అలర్ట్

**- పులుల ఆవాసాల వద్ద ప్రత్యేక శుభ్రత చర్యలు**

**- వైరస్ భయంతో వైద్యాధికారుల అప్రమత్తత - దత్తత కార్యక్రమానికి విశేష స్పందన**




**హైదరాబాద్, ఫిబ్రవరి 24**

హైదరాబాద్ మహానగరంలోని నెహ్రూ జూలాజికల్ పార్క్‌లో అధికారులు హై అలర్ట్ ప్రకటించారు. ఇటీవల విదేశీ జూపార్కులో పులులు వైరస్ కారణంగా మృతి చెందిన నేపథ్యంలో జూపార్క్‌లోని అన్ని జంతు ఆవాసాల వద్ద ప్రత్యేక చర్యలు చేపట్టారు. గతంలో కొవిడ్ వ్యాప్తి సమయంలో అమలు చేసిన ప్రోటోకాల్‌ను మళ్లీ అమల్లోకి తెచ్చారు. ముఖ్యంగా పులుల ఆవాసాల్లో పాత ఇసుకను తొలగించి కొత్త ఇసుక వేయడం, గోడలకు సున్నం పూయడం, గదుల చుట్టూ సోడియం హైపోక్లోరైట్ ద్రావణం పిచికారీ చేయడం వంటి చర్యలు చేపడుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా పర్యాటకులను ఆకర్షించే థాయ్‌లాండ్‌లోని ఓ ప్రైవేటు జూపార్కులో ఇటీవల 72 పులులు మరణించిన ఘటనతో అధికారులు అప్రమత్తమయ్యారు. నెహ్రూ జూపార్క్ క్యూరేటర్ జె. వసంత ఆదేశాల మేరకు వైద్యాధికారులు పులుల ఆవాసాలు, సందర్శకుల ప్రాంతాల్లో క్రిమి సంహారక మందులు పిచికారీ చేస్తున్నారు. పక్షులకు రోగ నిరోధకత పెంచే ఔషధాలను అందిస్తున్నట్లు తెలిపారు. ఇక జూపార్క్‌లో త్వరలో మాండ్రిల్ జాతికి చెందిన రెండు మగ నామాల కోతులు సందడి చేయనున్నాయి. జంషెడ్‌పూర్ జూపార్క్‌తో జంతువుల మార్పిడి కార్యక్రమంలో భాగంగా వీటిని తీసుకువచ్చారు. ప్రతిగా ఆఫ్రికన్ జాతికి చెందిన సింహాలను అక్కడికి పంపించారు. జంతు దత్తత కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. ఇప్పటివరకు 62 మంది కలిసి 89 జంతువులను దత్తత తీసుకున్నారు. దత్తత కాలం ఒక సంవత్సరం పాటు ఉంటుంది. దత్తతదారులకు ఆదాయపు పన్ను చట్టం 80జీ కింద మినహాయింపు, ఉచిత ప్రవేశ టికెట్లు, అతిథి గృహ వసతి వంటి సదుపాయాలు కల్పిస్తున్నారు. ఏనుగు, జిరాఫీ వంటి పెద్ద జంతువుల నిర్వహణకు రోజుకు సుమారు రూ.5000 ఖర్చవుతుండగా, పులి, సింహాలకు రోజుకు రూ.2000 వరకు వ్యయం అవుతోంది. మొసళ్లు, పక్షులు, పాములకు సంవత్సరానికి సుమారు రూ.50,000 వరకు ఖర్చవుతుందని అధికారులు తెలిపారు. జంతు సంరక్షణలో భాగంగా ముందస్తు చర్యలు చేపడుతున్నామని, ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని జూపార్క్ అధికారులు స్పష్టం చేశారు.

# మూసీ తీరంలో గాంధీ విగ్రహం

**చర్చల ముసురులో ప్రభుత్వం - ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన విగ్రహం ఏర్పాటు యోచన**

**- తుషార్ గాంధీ అభ్యంతరం... ప్రజాధన వినియోగంపై ప్రశ్నలు**

**- భూసేకరణ, పర్యావరణ అంశాలపై స్థానికుల ఆందోళన**

**హైదరాబాద్, ఫిబ్రవరి 24 :**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టులో భాగంగా బాపూఘాట్ వద్ద ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన మహాత్మా గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలన్న నిర్ణయం కొత్త చర్చకు దారితీసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం భారీ వ్యయంతో 'గాంధీ సరోవర్' ప్రాజెక్టును నిర్మించి, అక్కడ గాంధేయవాద కేంద్రాన్ని నెలకొల్పాలని ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఈ నిర్ణయం రాజకీయ, సామాజిక వర్గాల్లో విభిన్న అభిప్రాయాలకు కారణమైంది. ఈ విగ్రహ ప్రతిష్ఠాపనపై గాంధీజీ మునిమనుమడు తుషార్ గాంధీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. విగ్రహాల కోసం కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని ఖర్చు చేయడం సమర్థనీయం కాదని, ఆ నిధులను విద్య, వైద్య రంగాల అభివృద్ధికి వినియోగించడమే నిజమైన గాంధేయవాదమని అభిప్రాయపడ్డారు. విగ్రహాల సంస్కృతి పెరిగిపోతోందని ఆవేదన వ్యక్తం చేస్తూ, గాంధీ ఆశయాలను ప్రజల సంక్షేమంలో ప్రతిబింబించేలా చూడాలని ప్రభుత్వానికి సూచించారు. తనకు వ్యక్తిగతంగా విగ్రహాల ప్రతిష్ఠకు వ్యతిరేకమని పేర్కొంటూ నిర్ణయాన్ని పునరాలోచించాలని కోరారు. మరోవైపు, ఈ ప్రాజెక్టు కోసం లంగర్ హౌస్ పరిసరాల్లో జరుగుతున్న భూసేకరణ స్థానికుల్లో ఆందోళన కలిగిస్తోంది. తమ నివాసాలు కోల్పోతామనే భయం, పర్యావరణ అనుమతులపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం మాత్రం ఇది కేవలం పర్యాటక ప్రాజెక్టు కాదని, మూసీ నది ప్రక్షాళనలో భాగంగా నగర రూపురేఖలను మార్చే ప్రయత్నమని వివరిస్తోంది. సబర్మతి నది తీర అభివృద్ధి తరహాలో దీన్ని అభివృద్ధి చేస్తామని ధీమా వ్యక్తం చేస్తోంది. గాంధీ వారసుల నుంచే అభ్యంతరాలు రావడం ఇప్పుడు ప్రభుత్వానికి సవాలుగా మారింది. ఒకవైపు వారసత్వ గౌరవం, మరోవైపు ప్రజాధన వినియోగంపై చర్చలు ఈ నేపథ్యంలో మూసీ ప్రాజెక్టు భవిష్యత్ దిశపై ఆసక్తి నెలకొంది.



## ఏజెన్సీలో మళ్లీ పులి సంచారం

**- పాపికొండల నుంచి జనావాసాల వైపు కదలిక**

**- రంపచోడవరం, మారేడుమిల్లిలో నిఘా ముమ్మరం**

**- గ్రామస్తులకు అప్రమత్తంగా ఉండాలంటూ హెచ్చరిక**



**పోలవరం, ఫిబ్రవరి 24 :**

ఏజెన్సీ ప్రాంతంలో పులి భయం ప్రజలను ఇంకా వీడలేదు. పోలవరం జిల్లా ఏజెన్సీ ప్రాంతంలో మరోసారి పెద్దపులి సంచారం స్థానికులను ఆందోళనకు గురిచేస్తోంది. ఇటీవల పట్టుకుని పాపికొండలు అభయారణ్యంలో విడిచిపెట్టిన పులే మళ్లీ జనావాసాల వైపు వస్తుండటంతో గిరిజన గ్రామాల్లో భయాందోళనలు నెలకొన్నాయి. గత రెండు రోజులుగా రంపచోడవరం, మారేడుమిల్లి మండలాల అటవీ ప్రాంతాల్లో పులి కదలికలను అటవీశాఖ అధికారులు గుర్తించి నిఘా ముమ్మరం చేశారు. కొద్ది రోజుల క్రితం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పశువులపై దాడి చేసి భయాందోళన సృష్టించిన ఈ పులిని అటవీ అధికారులు కష్టపడి బంధించారు. అనంతరం విశాఖపట్నం జూకు తరలించి చికిత్స అందించారు. ప్రత్యేక కమిటీ నిర్ణయం మేరకు పాపికొండలు అభయారణ్యంలో తిరిగి విడిచిపెట్టారు. ఆ ప్రక్రియకు సంబంధించిన దృశ్యాలను కూడా విడుదల చేశారు. అయితే అభయారణ్యంలో వదిలిన పది రోజుల్లోనే పులి మళ్లీ జనావాసాల సమీపానికి రావడం గమనార్హం. రంపచోడవరం మండలంలోని గెద్దాడ, చిలకమామిడి, బూసిగూడెం అటవీ ప్రాంతాలతో పాటు మారేడుమిల్లి పరిధిలోని పలు గ్రామాల దగ్గర సంచరిస్తున్నట్టు అధికారులు తెలిపారు. పులి కదలికలను నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రత్యేక బృందాలను మోహరించారు. గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీ అధికారులు సూచించారు. ముఖ్యంగా రాత్రివేళల్లో ఒంటరిగా బయటకు వెళ్లవద్దని, రైతులు పొలాలకు వెళ్లేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు. పరిస్థితిని సమీక్షిస్తూ పులిని తిరిగి అటవీ ప్రాంతంలోకి తరలించే చర్యలపై కూడా అధికారులు పరిశీలన కొనసాగిస్తున్నారు.

## నిరసనలు హక్కు అని, వాటిని అవమానించడం సరికాదు

**నగ్న రాజకీయాలు' వ్యాఖ్యపై రాహుల్ ఘాటు ప్రతిస్పందన**

**- యూత్ కాంగ్రెస్ అర్ధనగ్న నిరసనలపై ప్రధాని వ్యాఖ్య**

**- అసలైన సిగ్గుచేటు ఏమిటో చెప్పిన రాహుల్**

**- ట్రేడ్ ఒప్పందం, ఎప్‌స్టీన్ ఫైల్స్‌పై ఆరోపణలు**



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24.**

ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ సందర్భంగా యూత్ కాంగ్రెస్ చేపట్టిన అర్ధనగ్న నిరసనలను ప్రధాని నరేంద్ర మోదీ 'నగ్న రాజకీయాలు'గా విమర్శించగా, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఘాటుగా స్పందించారు. ప్రజాస్వామ్యంలో శాంతియుత నిరసనలు హక్కు అని, వాటిని అవమానించడం సరికాదని ఆయన పేర్కొన్నారు. "అహింసతో కూడిన నిరసనలు ప్రజాస్వామ్యానికి పునాదులు. మా కార్యకర్తలు చొక్కాలు విప్పి నిరసన తెలపడం సిగ్గుచేటు అంటున్నారు. కానీ, సెక్స్ అఫెండర్ జెఫ్రీ ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో మీ పేరు, మీ స్నేహితుడి పేరు, మీ కేంద్ర మంత్రి పేరు బయటపడటం కంటే సిగ్గుచేటు మరొకటి ఉంటుందా?" అంటూ రాహుల్ ప్రధాని మోదీని నిలదీశారు. దీనిపై స్పష్టమైన సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అమెరికాతో కుదిరిన వాణిజ్య ఒప్పందం ద్వారా దేశ ప్రయోజనాలు దెబ్బతిన్నాయని ఆరోపిస్తూ, అదే దేశానికి అవమానమని విమర్శించారు. గాంధీజీ, భగత్ సింగ్ చూపిన పోరాట మార్గాన్ని అనుసరిస్తే ప్రభుత్వం ఎందుకు ఉలిక్కిపడుతోందని ప్రశ్నించారు. నిరసనలో పాల్గొన్న యూత్ కాంగ్రెస్ నేతల కుటుంబ సభ్యులను వేధించడం తగదని పేర్కొన్నారు. ఇటీవల వెలుగులోకి వచ్చిన ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరీ పేరు ఉన్నట్లు వస్తున్న ఆరోపణలను ప్రస్తావిస్తూ రాహుల్ స్పందించారు. ప్రజాస్వామ్యంలో నిరసన హక్కును అవమానించవద్దని, విమర్శలను వ్యక్తిగత దూషణలుగా మలచవద్దని ఆయన హితవు పలికారు.

## ఖమ్మం శివారులో ఉద్రిక్త పరిస్థితి

**వేలాది పోలీసులతో భారీ మోహరింపు**

**వెలుగుమట్ల వినోబా నగర్‌లో కూల్చివేతల సన్నాహాలు**

**మీడియా ప్రవేశానికి ఆంక్షలు, బాధితుల ఆవేదన**



**ఖమ్మం, ఫిబ్రవరి 24**

ఖమ్మం నగర శివారులో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. వెలుగుమట్ల వినోబా నగర్ భూదాన్ భూముల విషయంలో అధికారులు భారీ చర్యలకు సిద్ధమయ్యారు. నాలుగు జిల్లాల నుంచి వేలాది మంది పోలీసులను మోహరించినట్లు సమాచారం. భారీ సంఖ్యలో యంత్రాలతో పాటు పోలీసు బలగాలు అక్కడికి తరలించబడడంతో ఉదయం నుంచే ఉద్రిక్తత పెరిగింది. భూదాన్ భూముల్లో నిర్మించుకున్న పేదల ఇళ్లను కూల్చివే యడానికి రంగం సిద్ధమైందని స్థానికులు చెబుతున్నారు. పోలీసు శాఖ, రెవెన్యూ శాఖ, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బంది సంయుక్తంగా చర్యలు చేపట్టేందుకు సిద్ధమయ్యారు. జిల్లా కలెక్టర్ కార్యాలయానికి సమీప ప్రాంతంలోనే ఈ పరిణామాలు చోటుచేసుకోవడంతో హై టెన్షన్ వాతావరణం నెలకొంది. ఏ క్షణమైనా కూల్చివేతలు ప్రారంభమయ్యే అవకాశముందని సమాచారం. కవరేజ్ కోసం వెళ్తున్న మీడియా ప్రతినిధులను పోలీసులు ఎక్కడికక్కడ అడ్డుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. పై అధికారుల ఆదేశాల మేరకే మీడియాకు అనుమతి ఇవ్వడం లేదని పోలీసు వర్గాలు చెబుతున్నట్లు సమాచారం. దీనిపై జర్నలిస్టులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఇక తమ ఇళ్లను కోల్పోతామనే భయంతో నిర్వాసితులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అప్పులు చేసి ఇళ్లు నిర్మించుకున్నామని, ఇప్పుడు అకస్మాత్తుగా వెళ్లిపోవాలని చెప్పడం అన్యాయమని వాపోతున్నారు. కొంతమంది యువకులు కర్రలతో సిద్ధమై ప్రతిఘటించేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. బాధితుల ఆగ్రహం, పోలీసుల భారీ మోహరింపుతో ఖమ్మం శివారులో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.



# నా పెళ్లిపై అసత్య ప్రచారలెందుకు?

**నటి మెహరిన్ ఘాటు వ్యాఖ్యలు**

తన పెళ్లి వార్తలపై అసత్య కథనాలపై నటి మెహరిన్ తీవ్రంగా స్పందించారు. తన పెళ్లంటూ ఆర్టికల్ రాసిన ఓ మీడియా సంస్థపై నటి మెహరీన్ అసహనం వ్యక్తంచేశారు. గత రెండేళ్లుగా ఇలాంటి వ్యవహారాలపై మౌనంగా ఉన్నా, ఇప్పుడు మాట్లాడక తప్పడం లేదన్నారు. నేను ఎవరినీ వివాహం చేసుకోలేదు. పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నప్పుడు ప్రపంచానికి చెబుతా.. అంతేగానీ తన పెళ్లి గురించి వదంతులు వ్యాప్తి చేయొద్దని కోరారు. హరియాణాకు చెందిన భవ్యా బిష్ణోయ్‌తో మెహరీన్ నిశ్చితార్థం జరిగినా అనివార్య కారణాల వల్ల పెళ్లి రద్దు అయింది. 2022లో వచ్చిన 'ఎఫ్ 3' తర్వాత ఆమె నటించిన తెలుగు సినిమా 'స్పార్క్'. కోలీవుడ్‌లోనూ ఒక్క సినిమాలోనే (ఇంద్ర) నటించారు. ప్రస్తుతం కన్నడలో ఓ చిత్రం చేస్తున్నారు. కెరీర్‌లో గ్యాప్‌పై ఓ ఇంటర్వ్యూలో స్పందించారు. గ్యాప్ కావాలని తీసుకోలేదని, 'ఎఫ్ 3' తర్వాత చేసిన 'సుల్తాన్ ఆఫ్ ఢిల్లీ' వెబ్‌సిరీస్ కోసం ఎక్కువ సమయం కేటాయించానని తెలిపారు.



# డబ్బు ఒక్కటే ప్రామాణికం కాదు

'సినిమా అనేది ప్రజల సమస్యలను పెంచకూడదు. వినోదాన్ని మాత్రమే పంచాలి.' అంటున్నారు బాలీవుడ్ నటి హ్యూమా ఖురేషి. ఇటీవల ఓ ప్రెస్‌మీట్‌లో ఆమె నేటి సినిమాల గురించి ఆసక్తికరంగా మాట్లాడారు. 'స్క్రిప్ట్ ఎంచుకునే విషయంలో నేను కొన్ని విలువలకు కట్టుబడి ఉంటా. సినిమా ప్రజల్లో ద్వేషాన్ని పెంచేలా ఉండకూడదని భావిస్తాను. కథల ఎంపికల విషయంలో డబ్బు ఒక్కటే ప్రామాణికం కాదు. నా ఎంపికలన్నీ విలువలతో కూడుకున్నవే.' అని తెలిపారామె. గ్యాంగ్స్ ఆఫ్ వాసేపూర్, మహారాణి, హీరా మండి చిత్రాల్లో ప్రయోగాత్మక పాత్రలతో మెప్పించిన హ్యూమా.. రీసెంట్‌గా రిలీజైన 'ఢిల్లీ క్రైమ్' వెబ్‌సీరీస్ సీజన్ 3లో కీలక పాత్ర పోషించింది. ప్రస్తుతం ఆమె నిర్మాతగానూ కొనసాగుతున్నది.





# అమెజాన్‌లోకి రష్మిక థామా మూవీ

మ్యాడ్ డాక్ ఫిలిమ్స్ తెరకెక్కించిన హార్రర్ మూవీస్‌కు సూపర్ క్రేజ్ ఉంటుందని తెలిసిందే. ఇదే జోనర్‌లో రష్మిక మందన్నా, ఆయుష్మాన్ ఖురానా కాంబోలో దీపావళి సీజన్‌లో ఎంట్రీ ఇచ్చిన బాలీవుడ్ చిత్రం థామా . మ్యాడ్‌డాక్ హార్రర్ సినిమాటిక్ యూనివర్స్‌లో భాగంగా వచ్చిన ఈ చిత్రం థియేటర్లలో విడుదలై మిక్స్‌డ్ టాక్ తెచ్చుకుంది. తెలుగులో కూడా డబ్బింగ్ అయిన ఈ చిత్రానికి యావరేజ్ టాక్ వచ్చింది. ఆ తర్వాత థామా పాపులర్ ఓటీటీ ఎ÷–లాట్‌ఫాం అమెజాన్ ప్రైం వీడియోలో ఇటీవలే రెంటల్ బేసిస్‌లో ఎంట్రీ ఇచ్చింది. ఈ చిత్రాన్ని ఇక ఉచితంగా చూసేయొచ్చు. థామా అమెజాన్ సబ్ స్క్రైబర్లకు ఉచితంగా అందుబాటులో ఉంది. హిందీ, తెలుగు ఆడియోతోపాటు ఇంగ్లీష్ సబ్ టైటిల్స్ తో వీక్షించవచ్చు. ఆదిత్య సర్పోట్‌దర్ డైరెక్టర్ చేసిన ఈ చిత్రంలో నవాజుద్దీన్ సిద్దిఖీ, పరేశ్ రావల్ ఇతర కీలక పాత్రల్లో నటించారు. సచిన్–జిగర్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందించారు. మలైకా అరోరా, నోరా ఫతేహి, వరుణ్ ధవన్ కామియో రోల్స్‌లో నటించారు.

# అది చాలెంజ్‌తో కూడుకున్న పని..

తెలుగు ప్రేక్షకులకు పెద్దగా ఇంట్రడక్షన్ అవసరం లేని యాక్టర్ కీర్తిసురేశ్ మహానటి సినిమాతో నేషనల్ అవార్డు అందుకున్న ఈ భామ తమిళం, తెలుగుతోపాటు పలు ప్రధాన భారతీయ భాషల్లో మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించుకుంది. పక్కా ప్రొఫెషనల్‌గా ఉండే ఈ బ్యూటీ ఫిట్‌నెస్‌పై కూడా మంచి ఫోకస్ పెడుతుందని తెలిసిందే. ఈ ముద్దుగుమ్మ ఓ విషయంలో ఇప్పటికీ ఫైట్ చేస్తుందట. ఇంతకీ ఏమిటా విషయమను కుంటున్నారా..? కీర్తిసురేశ్ మంచి ఫుడ్ లవర్. ఈ విషయంలో ఇబ్బంది పడుతుందట. ఓ చిట్ చాట్‌లో ఇదే విషయమై కీర్తిసురేశ్ మాట్లాడుతూ.. ఫుడ్‌పై నాకున్న ఇష్టాన్ని నియంత్రించుకునే విషయంలో నేనిప్పటికీ నాతో నేనే ఫైట్ చేస్తుంటానని.. కఠినమైన డైట్‌ను ఫాలో అవడం తనకు చాలెంజ్‌తో కూడుకున్న పని అని చెప్పింది కీర్తిసురేశ్. మొత్తానికి ఓ వైపు ఫుడ్ విషయంలో బ్యాలెన్స్ తప్పుతున్న ఫిజిక్ మెయింటైన్ చేయడంలో మాత్రం కీర్తిసురేశ్ కాంప్రమైజ్ అవడం లేదని ఈ బ్యూటీ లుక్స్ చూస్తే తెలిసిపోతుంది. ఫిట్‌నెస్ జర్నీ విషయంలో తన అభిమానులకు స్ఫూర్తిగా నిలిచే కీర్తిసురేశ్ కామెంట్స్ ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతున్నాయి.